09-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఒక్క తండ్రితో సత్యమైన ప్రేమ ఉన్నట్లయితే తండ్రి మిమ్మల్ని తమతోపాటు ఇంటికి తీసుకువెళ్తారు, అన్ని పాపాల నుండి ముక్తులుగా చేస్తారు, స్వర్గాధిపతులుగా చేస్తారు"

ప్రశ్న:- మిమ్మల్ని మీరు సంతోషముగా ఉంచుకునేందుకు ఏ ముఖ్యమైన ధారణ కావాలి?

జవాబు:- ఎప్పుడైతే మీతో మీకు ఆత్మిక సంభాషణ చేయడం వస్తుందో, అప్పుడే సంతోషములో ఉండగలుగుతారు. ఏ వస్తువు పట్ల ఆసక్తి ఉండకూడదు. కడుపుకు రెండు రొట్టెలు లభిస్తే చాలు - ఇటువంటి అనాసక్త వృత్తి యొక్క ధారణ ఉండాలి, అప్పుడే హర్షితముగా ఉంటారు. జ్ఞానాన్ని మననం చేస్తూ స్వయాన్ని హర్షితంగా ఉంచుకోండి. మీరు కర్మయోగులు, కర్మలు చేస్తూ, ఇంటి పనులు చేస్తూ, భోజనం మొదలైనవి చేస్తూ కూడా తండ్రిని స్మృతి చేయండి. స్వదర్శన చక్రము బుద్ధిలో తిరుగుతూ ఉండాలి, అప్పుడు ఎంతో సంతోషము ఉంటుంది.

పాట:- వారు మా నుండి వేరు కారు... (నా వహ్ హమ్సే జుదా హోంగే...)

ఓం శాంతి. మధురాతి-మధురమైన పిల్లలు పాటను విన్నారు. ఇది పిల్లలకు లేక ఆత్మలకు తమ పరమపిత పరమాత్మని పట్ల ఉన్న ఆత్మిక ప్రేమ. ఈ ఆత్మిక ప్రేమ కేవలం బ్రాహ్మణ పిల్లలైన మీకు మాత్రమే ఉంటుంది. మీరు స్వయాన్ని ఆత్మగా నిశ్చయం చేసుకుంటారు. కానీ ఆత్మయే పరమాత్మ అని అన్నట్లయితే, ఆత్మ ఎవరి పట్ల ప్రేమను ఉంచాలి. ప్రేమ అనేది పిల్లలకు తండ్రి పట్ల ఉంటుంది. తండ్రికి, తండ్రికి మధ్యన ప్రేమ అన్నట్లు ఉండదు. ఆత్మలమైన మనం మన పరమపిత పరమాత్మతో ప్రేమను జోడిస్తున్నామని ఇప్పుడు మీరు అర్థం చేసుకుంటారు. ఈ ప్రేమయే మిమ్మల్ని వారితోపాటు తీసుకువెళ్తుంది. మీరు తండ్రి పట్ల ఆత్మిక ప్రేమను పెట్టుకున్నారు కావున కష్టాలను కూడా సహనం చేయాల్సి ఉంటుంది. మొత్తం ప్రపంచము, ఇంటిలోని సభ్యులు మొదలైనవారంతా శత్రువులు అయిపోతారు.

పతిత-పావని గంగ కాదు అని పిల్లలకు అర్థం చేయించారు. మనుష్యులు పావనంగా అవ్వాలనే ఆలోచనతో హరిద్వార్ కు, కాశీకి వెళ్ళి గంగా నది తీరంలో లేక యమునా నది తీరంలో కూర్చుంటారు. ఈ రెండూ ముఖ్యమైన స్థానాలు. ఓ పతిత-పావని గంగా అని అంటారు. ఇప్పుడు ఆ గంగ అయితే ఏమీ వినదు. వినేవారు ఒక్క పతిత-పావనుడైన తండ్రే. ఇప్పుడు మీరు ఆ తండ్రి సమ్ముఖంలో కూర్చున్నారు. మీరు పావనంగా ఎలా అవుతారు అనేది తండ్రి తెలియజేస్తున్నారు. నీటి గంగ ఏమైనా - నన్నొక్కరినే స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయని చెప్తుందా. తండ్రి అంటారు - నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను, ఒకవేళ మీరు తండ్రినైన నన్ను స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయి. తండ్రి గ్యారంటీ ఇస్తారు, గంగ అయితే గ్యారంటీ ఇవ్వలేదు. ఏ విధంగా మనుష్యులు రావణుడిని ప్రతి సంవత్సరం కాలుస్తూ వచ్చారు కానీ రావణుడు మరణించనే మరణించడో, అలాగే గంగలో స్నానాలు కూడా జన్మజన్మాంతరాలుగా చేస్తూ వచ్చారు కానీ ఎవ్వరూ పతితుల నుండి పావనులుగా అవ్వనే అవ్వరు. స్నానాలు చేయడానికి మళ్ళీ-మళ్ళీ వెళ్తూ ఉంటారు. ఒకసారి పావనమయ్యారంటే స్నానాలు చేయడానికి మళ్ళీ ఎందుకు వెళ్తారు? ఎన్నో మేళాలు జరుగుతాయి. వాటిని ఆత్మ-పరమాత్మల సంగమము అని అనరు. భక్తి మార్గంలో మేళాలలో గుంపులు ఏర్పడతాయి. ఇప్పుడు మీరు తండ్రితో బుద్ధియోగాన్ని జోడిస్తారు. ఆత్మలమైన మనం ప్రేయసులుగా అయ్యామని మీకు తెలుసు. ఆత్మయే శరీరం ద్వారా భగవంతుడిని తలచుకుంటుంది. తండ్రి అంటారు - నేను కూడా ఈ శరీరం ద్వారా మిమ్మల్ని చదివిస్తున్నాను, అందుకే ఎల్లప్పుడూ బాబాను స్మృతి చేస్తూ ఉండండి. బాబా అని అనడంతో స్వర్గం తప్పకుండా గుర్తుకొస్తుంది మరియు మన ముక్తిధామమైన ఇల్లు కూడా గుర్తుకొస్తుంది. ముక్తిని నిర్వాణధామము అని కూడా అంటారు.

ఇది సాకార ప్రపంచము. ఎప్పటివరకైతే ఆత్మలు ఇక్కడికి రారో, అప్పటివరకు సాకార ప్రపంచము ఎలా వృద్ధి చెందుతుంది? ఆత్మలు నిరాకార ప్రపంచం నుండి వస్తాయి. మనుష్య సృష్టి వృద్ధి చెందుతూ ఉంటుంది. కొందరేమో అది దానంతటదే వృద్ధి చెందుతూ ఉంటుందని భావిస్తారు. కానీ మీకు తెలుసు - ఆత్మలు ఇక్కడకు వస్తారు, సృష్టి వృద్ధి చెందుతూ ఉంటుంది. స్వీట్ హోమ్ శాంతిధామము అని పిల్లలకు తెలిసింది. శాంతిని ఎంతోమంది ఇష్టపడతారు. శాంతిధామము మన మధురమైన గాడ్ ఫాదర్ యొక్క ఇల్లు అని మీకు తెలుసు. భారతవాసులు విదేశాల నుండి తిరిగి

వచ్చేటప్పుడు - మేము మా స్వీట్ హోమ్ అయిన భారత్ కు వెళ్తున్నాము అని అంటారు. ఎక్కడైతే జన్మ తీసుకుంటారో ఆ దేశము ప్రియమనిపిస్తుంది. మమ్మల్ని స్వీట్ హోమ్ (భారత్) కు తీసుకువెళ్ళండి అని అంటారు. అచ్ఛా, ఎవరైనా మరణించారనుకోండి, ఆత్మ అయితే వెళ్ళిపోయింది, అప్పుడు శరీరాన్ని ఇక్కడకు తీసుకువచ్చి అంతం చేస్తారు. భారత్ యొక్క మట్టి భారత్ లోకే వెళ్ళాలి అని భావిస్తారు. నెహ్రూ శరీరం విడిచిపెట్టినప్పుడు వారి బూడిదను ఎక్కడెక్కడికి తీసుకువెళ్ళారో చూడండి! పొలాలలో వేసారు. పంట బాగా పండుతుందని భావిస్తారు. కానీ వారు ప్రతి వస్తువుకు ఎంత గౌరవాన్ని ఇచ్చినా కానీ అది తప్పకుండా పాతగా అవ్వాల్సిందే. ఎన్ని కష్టాలను సహనం చేస్తున్నారు! వారికి తండ్రి గురించి తెలియదు. మీరు తండ్రిని తెలుసుకుని తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటున్నారు. కావున మిత్ర-సంబంధీకులు మొదలైనవారిని కూడా స్వర్గవాసులుగా తయారుచేయాలని మనసు కలుగుతుంది. ఎవరికైనా - మీరు స్వర్గవాసులుగా అవ్వండి అని చెప్తే, మీరు మమ్మల్ని చంపాలని అనుకుంటున్నారా అని అడుగుతారు. పిల్లలైన మీకు తెలుసు - శ్రీమతము ద్వారా మనం శ్రేష్ఠమైన స్వర్గవాసులుగా అవుతున్నాము. దేహీ-అభిమానులుగా అవ్వడానికి ఎంతో శ్రమ కలుగుతుంది. పదే-పదే దేహాభిమానంలోకి వచ్చి తండ్రిని మర్చిపోతారు. ఇప్పుడు మీరు సమ్ముఖంగా కూర్చున్నారు. మనము మన పరమపిత పరమాత్మ వద్దకు వచ్చామని మీకు తెలుసు. బాబా అడుగుతారు - ఇంతకుముందు ఎప్పుడైనా కలుసుకున్నామా? అప్పుడు వెంటనే - అవును బాబా, 5000 సంవత్సరాల క్రితం కలుసుకున్నాము అని చెప్తారు. మీ ఈ మాటలు గుప్తమైనవి. వీటిని ఇంకెవ్వరూ కాపీ చేయలేరు. అయితే శ్రీకృష్ణుని వేషాన్ని ధారణ చేసి, మేము స్వర్గ స్థాపన చేయడానికి వచ్చాము అని అనవచ్చు, కానీ 5000 సంవత్సరాల క్రితం కూడా స్వర్గ స్థాపన చేసాము అన్న మాటను చెప్పలేరు. మీరు కూడా అంటారు - బాబా, 5000 సంవత్సరాల క్రితం మేము మీ నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు వచ్చాము, మీరు రాజయోగాన్ని నేర్పించారు. ఈ విధంగా ఆత్మ ఈ శరీరం ద్వారా అంటుంది. స్వయాన్ని ఆత్మగా నిశ్చయం చేసుకుని తండ్రిని స్మృతి చేయాలి, ఇందులో సర్వవ్యాపి విషయమేమీ లేదు. బ్రహ్మ తప్పకుండా సాకారంలో ఉండాలని, వారి ద్వారానే పరమపిత పరమాత్మ సృష్టిని రచిస్తారని కూడా అర్థం చేసుకోరు.

పతిత-పావనుడైన తండ్రి వచ్చి మళ్ళీ దేవీ-దేవతలుగా, పావనులుగా తయారుచేస్తారు. తండ్రే స్వర్గ రచయిత, కావున తప్పకుండా స్వర్గంలో మనుష్యులు ఉండాలి. బాబా వచ్చి మీకు స్వర్గ ద్వారాల గురించి తెలియజేస్తారు. మేము నరకవాసులను స్వర్గవాసులుగా తయారుచేయాలి - అని మీరు ప్రయత్నిస్తారు. ఎవరైనా గొప్ప వ్యక్తికి - నీవు పతితుడివి, నరకవాసివి అని డైరెక్టుగా చెప్తే వారు ఎంత డిస్టర్బ్ అవుతారు. మనం నరకం నుండి బయటకొచ్చి స్వర్గంలోకి వెళ్తున్నామని ఇప్పుడు మీకు తెలుసు. ఇప్పుడు మనం సంగమవాసులము. ఇప్పుడు ఆత్మలమైన మనం - ఈ శరీరాన్ని వదిలి బాబాతో పాటు, బాబా ఇంటికి వెళ్తున్నాము. ఇది మీ ఆత్మిక యాత్ర. బాబా స్మృతిలో ఉండాలి. ఎప్పటివరకైతే ఈ శరీరము ఉంటుందో, అప్పటివరకు యాత్ర కొనసాగుతుందని మీరు అర్థం చేసుకుంటారు. కర్మలు కూడా చేయాలి. తినండి, తాగండి, వంట చేయండి, ఎంత సమయం లభిస్తే అంత సమయం తండ్రిని తప్పకుండా స్మృతి చేయాలి. ఆఫీసులో కూర్చున్నప్పుడు ఖాళీ దొరికినట్లు అనిపిస్తే చూడండి, బాబా స్మృతిలో కూర్చుండిపోండి. ఇందులో చాలా సంపాదన ఉంది. ట్రైన్ లో ప్రయాణించేటప్పుడు, ఆ సమయంలో ఏ పనీ ఉండదు. కూర్చుని ఉంటూనే బాబాను స్మృతి చేస్తూ ఉండండి. ఇప్పుడు మనం బాబా వద్దకు వెళ్తాము. బాబా పరంధామం నుండి మనల్ని తీసుకువెళ్ళేందుకు వచ్చారు. అచ్ఛా, సాయంత్రము ఇంట్లో వంట వండేటప్పుడు కూడా ఒకరికొకరు స్మృతిని ఇప్పించుకోండి - రండి, మనం మన తండ్రి స్మృతిలో కూర్చుందాము. ఒకరికొకరు పాయింట్లను కూడా వినిపించుకోండి. మనం స్వదర్శన చక్రధారులము. బాబా అంటారు - మీరు లైట్ హౌస్ లు కూడా, మీరు మార్గాన్ని తెలియజేస్తారు. లేస్తూ, కూర్చుంటూ, నడుస్తూ మీరు లైట్ హౌస్ లు. మీకు ఒక కంటిలో ముక్తి, ఇంకొక కంటిలో జీవన్ముక్తి ఉన్నాయి. స్వర్గము ఇక్కడ ఉండేది. ఇప్పుడు లేదు. ఇప్పుడిది నరకము. బాబా మళ్ళీ స్వర్గాన్ని స్థాపన చేస్తున్నారు. బాబా అంటారు, నేను మిమ్మల్ని మంచి పుష్పాలుగా తయారుచేస్తాను. తర్వాత మీరు వెళ్ళి మహారాణులుగా, పట్టపురాణులుగా అవుతారు. ఖద్దరు రాణులుగా (చంద్రవంశీ రాణులుగా) అవ్వకండి. మీరు 16 కళల సంపూర్ణులుగా అవ్వాలి, అంతేకానీ 14 కళలు కలవారిగా కాదు. శ్రీకృష్ణుడు 16 కళల కలవారు. కుమార్తెలైన మీరు ఎన్ని వ్రతాలు-నోములు మొదలైనవి చేసేవారు! 7 రోజులు నిర్జలముగా ఉండేవారు, ఎంత కష్టపడేవారు! కానీ శ్రీకృష్ణపురిలోకి వెళ్ళలేకపోయారు. ఇప్పుడు మీరు కృష్ణపురిలోకి, స్వర్గంలోకి ప్రాక్టికల్ గా వెళ్ళేందుకు పురుషార్థం చేస్తున్నారు. శ్రీకృష్ణుడిని ద్వాపరంలోకి తీసుకువెళ్ళడం వలన స్వర్గము గురించి ఎవ్వరికీ తెలియదు. వాస్తవానికి 7 రోజుల అంటే అర్థమేమిటి అనేది మీకు ఇప్పుడు తెలుసు. ఒక్క తండ్రిని తప్ప ఇంకెవ్వరినీ స్మృతి చేయకూడదు. ఇకపోతే నిర్జలముగా ఉండే విషయమేమీ లేదు. బాబాను స్మృతి చేయడంతో మీరు బాబా వద్దకు వెళ్ళిపోతారు. తండ్రి మళ్ళీ

స్వర్గంలోకి పంపిస్తారు. వ్రతాలు-నోములు చేస్తూ మీరు ఎన్ని రోజులు ఆకలితో ఉంటారు! జన్మ-జన్మలుగా ఎంతగా కష్టపడుతూ ఉన్నారు! కానీ ఎటువంటి ప్రాప్తి కలగలేదు. ఇప్పుడు మిమ్మల్ని వాటి నుండి విడిపించి సద్గతి మార్గంలోకి తీసుకువెళ్తారు. మీరంటారు - బాబా, కల్పక్రితము కూడా స్వర్గ వారసత్వాన్ని తీసుకునేందుకు మిమ్మల్ని కలుసుకున్నాము. తండ్రి అంటారు - అడుగడుగులోనూ సలహా తీసుకుంటూ ఉండండి. అని లెక్కలను అడగండి. బాబా సలహాలు ఇస్తూ ఉంటారు. మీరు మీ వ్యాపార-వ్యవహారాలు మొదలైనవి చేసుకుంటూ ఉండండి, అయినా కూడా బాబా సలహాలు ఇస్తూ ఉంటారు. ఇతను వ్యాపారములో బాగా చిక్కుకుపోయారని గమనించి తండ్రి సలహాను ఇస్తారు - ఎందుకు ఇంతగా కష్టపడుతున్నావు? నీవు ఎంత సమయం జీవిస్తావు, కడుపు అయితే ఒకటి-రెండు రొట్టెలే అడుగుతుంది. దానితోనే పేదవారూ జీవిస్తారు, అలాగే షావుకార్లు కూడా జీవిస్తారు. షావుకారులు బాగా తింటారు, అలాగే రోగగ్రస్థులుగా కూడా అవుతారు. ఆటవికులు చూడండి, ఎంత దృఢంగా ఉంటారు! కానీ వారు తినేదేమిటి! ఎంత పని చేస్తారు! వారి గుడిసెలోనే వారు సంతోషంగా ఉంటారు. కావున ఈ సమయంలో మీరు మిగిలిన ఆశలన్నింటినీ విడిచిపెట్టాలి. రెండు రొట్టెలు దొరికి కడుపు నిండితే చాలు, ఇక తండ్రిని స్మృతి చేయాలి. మీరు ఆత్మిక పిల్లలు, ప్రియుడైన పరమపిత పరమాత్మకు ప్రేయసులుగా అయ్యారు. ఎంతగా బాబాను స్మృతి చేస్తారో, అంతగా వికర్మలు వినాశనమవుతాయి మరియు ఎవరినైతే స్మృతి చేస్తారో, వారిని వెళ్ళి కలుసుకుంటారు. సాక్షాత్కారాలు జరగాలని, ఇంకేదో జరగాలని ఎంతోమంది కోరుకుంటారు. బాబా అంటారు - ఇంట్లో కూర్చుని కూడా మీకు సాక్షాత్కారాలు జరగవచ్చు. శివబాబాను స్మృతి చేయడం ద్వారా మీకు వైకుంఠం యొక్క సాక్షాత్కారం జరుగుతుంది, శ్రీకృష్ణపురిని చూస్తారు. ఇక్కడైతే బాబా మిమ్మల్ని వైకుంఠానికి యజమానులుగా చేస్తారు. ఇది కేవలం సాక్షాత్కారాల విషయమే కాదు. నన్ను స్మృతి చేయండి ఎందుకంటే నేను మిమ్మల్ని తీసుకువెళ్ళేందుకు వచ్చాను. శివబాబాను స్మృతి చేయాలి. వారే శ్రీకృష్ణపురికి యజమానులుగా తయారుచేసేవారు. శ్రీకృష్ణుడు అలా తయారుచేయరు. శివబాబాను స్మృతి చేయడం ద్వారా మీకు వైకుంఠ రాజ్యాధికారం లభిస్తుంది. ఇప్పుడు వారు పరంధామం నుండి వచ్చి ఉన్నారు. వారు తప్పకుండా వచ్చారు కావుననే స్మృతిచిహ్న మందిరాలు తయారయ్యాయి కదా. శివుని మందిరం ఉంది. శివజయంతిని కూడా జరుపుకుంటారు కదా. కానీ వారు భారత్ లోకి ఎలా వస్తారు అనేది ఎవ్వరికీ తెలియదు. వారు శ్రీకృష్ణుని తనువులోకైతే రారు. శ్రీకృష్ణుడు సత్యయుగంలోనే ఉంటారు. శివునికి చాలా పెద్ద మందిరం ఉంది. శ్రీకృష్ణునికి అంత పెద్ద మందిరం లేదు. సోమనాథ మందిరము ఎంత పెద్దది. శ్రీకృష్ణుని మందిరంలో రాధ-కృష్ణులకు ఎన్నో ఆభరణాలను చూపిస్తారు. శివుని మందిరాలలో ఎప్పుడూ ఆభరణాలను చూడరు. శివబాబా అయితే పెద్ద మహాళ్ళలో ఏమీ ఉండరు. పెద్ద మహాళ్ళలో ఉండేది శ్రీకృష్ణుడు. బాబా అంటారు - నేను అసలు మహాళ్ళలోనే ఉండను, కానీ భక్తి మార్గంలో వజ్ర-వైఢూర్యాలతో కూడిన ఎంత పెద్ద, వైభవోపేతమైన మందిరాన్ని నిర్మించారు! ఎవరికైతే శివబాబా ద్వారా స్వర్గ వారసత్వం లభించిందో, వారు శివుని మందిరాన్ని ఇంత గొప్పగా తయారుచేసారు. స్మృతిచిహ్నముగా ఎంత పెద్ద మందిరాన్ని నిర్మించారు! మరి వారు స్వయం ఎంత షావుకార్లు అయి ఉంటారు! మందిరాన్ని చాలా బాగా నిర్మిస్తారు. బొంబాయిలో బాబురీనాథ్ లో శివుని మందిరము ఉంది. మాధవ్ బాగ్ లో లక్ష్మీ-నారాయణుల మందిరము ఉంది. తండ్రి అంటారు - నేను మిమ్మల్ని స్వర్గాధిపతులుగా చేస్తాను. భక్తి మార్గంలో మీరు ఎంత పెద్ద మందిరాలను నిర్మిస్తారు, కానీ ఇప్పుడు ఎటువంటి గుడిసెలో కూర్చున్నానో చూడండి! మీ పేరు కూడా ప్రసిద్ధము కానున్నది. తర్వాత మన మందిరాలు తయారవుతాయని మీకు తెలుసు. మన తండ్రి అయిన శివుని మందిరాలు కూడా ఎన్నో ఉన్నాయి, ఇది అద్భుతము. ఎవరైతే సోమనాథ మందిరాన్ని నిర్మించారో, వారు ఎంతటి షావుకార్లు అయి ఉంటారు! ఇప్పుడు ఎంత గుప్తంగా ఉన్నాను. నా గురించి ఎవ్వరికీ తెలియదు. శివబాబా మందిరాలను మళ్ళీ ఎలా నిర్మించవలసి ఉంటుంది అనేది మీరు తెలుసుకున్నారు. భక్తి మార్గంలోకి వెళ్తారు. మమ్మా-బాబాలెవరైతే మొదటి నంబరులో పూజ్యులుగా అవుతారో, వైకుంఠానికి యజమానులుగా అవుతారో, వారే మళ్ళీ మొట్టమొదట పూజారులుగా అయి మందిరాలను కూడా నిర్మించాల్సి ఉంటుంది. కావున - మేమే పూజారులుగా అయి మందిరాలను నిర్మిస్తాము అని మనస్సులో అనుకుంటారు కదా. ఇటువంటి విషయాలలో రమించడం ద్వారా ఇక ఈ పాత ప్రపంచాన్ని మర్చిపోతారు. పరస్పరంలో కూడా ఇటువంటి విషయాలను మాట్లాడుకోవాలి, తద్వారా మీకు ఎంతో సంతోషం ఉంటుంది. మీతో మీరు ఆత్మిక సంభాషణ చేసుకోండి.

పరమ ఆత్మ కూర్చొని మీ ఆత్మను సంతోషపెడతారు. ఈ జ్ఞానం ద్వారా హర్షితంగా చేస్తారు. మీరంటారు - మేము కల్పం తర్వాత మళ్ళీ వచ్చాము, అనేక సార్లు తండ్రిని కలుసుకున్నాము, వారసత్వాన్ని పొందాము. ఈ విధంగా మీతో మీరు మాట్లాడుకోవాలి. అలాగే మీరు కర్మయోగులు కూడా. ఇంట్లో భోజనము మొదలైనవి వండుతున్నా సరే సంతోషం ఉంటుంది. మీకు 84 జన్మల చరిత్ర-భౌగోళికాల గురించి తెలుసు. మనం ఇప్పుడు బ్రాహ్మణులుగా అయ్యాము, తర్వాత

దేవతలుగా అయి రాజ్యం చేస్తాము. పూజారుల నుండి పూజ్యులుగా అవుతాము. మళ్ళీ మహళ్ళు మొదలైనవి నిర్మిస్తాము. మీ చరిత్ర-భౌగోళికాలను వినిపిస్తూ ఉండండి. మన చరిత్ర-భౌగోళికాల చక్రం ఎలా తిరుగుతూ ఉంటుంది - దీనినే స్వదర్శన చక్రాన్ని తిప్పడము అని అంటారు. మీరు మూడు లోకాల గురించి తెలిసినవారు. మీ జ్ఞాన నేత్రం తెరుచుకుంది. ఈ చక్రాన్ని స్మృతి చేయడం ద్వారా మీకు ఎంతో సంతోషము కలగాలి. తండ్రికి కూడా సంతోషము ఉంటుంది. ఇప్పుడు మీరు సేవలో ఉపస్థితులై ఉన్నారు. సేవాధారులైన మీ మందిరాలు తర్వాత భక్తి మార్గంలో తయారవుతాయి. ఇప్పుడు నేను, పిల్లలైన మీ సేవ కొరకు వచ్చాను. మీకు స్వర్గం యొక్క పూర్తి వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చాను. ఎవరెంతగా పురుషార్థం చేస్తారో, దాని అనుసారంగా స్వర్గాధిపతులుగా అవుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. నడుస్తూ-తిరుగుతూ లైట్ హౌస్ లుగా అయి అందరికీ దారిని చూపించాలి. అన్ని ఆశలను వదిలి ఒక్క తండ్రి స్మృతిలో ఉండాలి. తండ్రి నుండి సలహాలు తీసుకుంటూ ఉండాలి.

2. జ్ఞాన విషయాలలోనే రమిస్తూ ఉండాలి. మీతో మీరు మాట్లాడుకుంటూ ఉండాలి. స్వదర్శన చక్రాన్ని తిప్పుతూ సదా హర్షితముగా ఉండాలి.

వరదానము:- యోగము అనే ఎండలో అశ్రువుల ట్యాంక్ ను ఎండిపోయేలా చేసి ఏడుపు ప్రూఫ్ గా అయ్యే సుఖ స్వరూప భవ

కొందరు పిల్లలు అంటారు - ఫలానావారు దుఃఖమునిచ్చారు కావున ఏడుపు వచ్చింది. కానీ వారు ఇస్తున్నారు సరే, మీరెందుకు తీసుకుంటారు? వారి పని ఇవ్వటము, మీరు తీసుకోనే తీసుకోకండి. పరమాత్మ పిల్లలు ఎప్పుడూ ఏడవలేరు. ఏడుపు సమాప్తము. కనుల ద్వారా ఏడ్వడము ఉండకూడదు, మనసు ద్వారా ఏడ్వడము ఉండకూడదు. ఎక్కడైతే సంతోషము ఉంటుందో, అక్కడ ఏడుపు ఉండదు. సంతోషము లేక ప్రేమ యొక్క అశ్రువులను ఏడుపు అని అనరు. కావున యోగమనే ఎండలో అశ్రువులు ట్యాంక్ ను ఎండిపోయేలా చేయండి, విఘ్నాలను ఆటగా భావించండి, అప్పుడు సుఖ స్వరూపులుగా అవుతారు.

స్లోగన్:- సాక్షీగా ఉంటూ పాత్రను అభినయించే అభ్యాసము ఉన్నట్లయితే టెన్షన్ నుండి దూరంగా స్వతహాగా అటెన్షన్ లో ఉంటారు.